సాక్షి
ప్రకాశం
బుధవారం । 16 । అక్టోబర్ । 2024



ఇసుక..ఇసుమంతైనా లేక

ఇసుక కొరతతో జనం అల్లాడుతున్నారు. ఇసుక దొరకక సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇళ్ల నిర్మాణాలు నిలిపేశారు. దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేవు. - 10లో..



పునరావాస కేంద్రాల పరిశీలన

అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పునరావాస కేంద్రాల్లో ఉన్న వారిని కలెక్టర్ పరిశీలించారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
29.7/24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడవచ్చు. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించాలి



భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్‌తో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే మార్గానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియలో నిర్వాసితులకు పరిహారం త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న కలెక్టర్‌కు సూచించారు. అమరావతి నుంచి రైలు మార్గం వెళ్తున్న జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు. పామూరు, కనిగిరి మండలాల్లో భూ సేకరణ ప్రక్రియలో పరిహారం చెల్లింపుల్లో జాప్యంపై ప్రద్యుమ్న ఆరా తీశారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్ సంజీవరావుతో భూ సేకరణ ప్రక్రియపై సమీక్షించారు.

పశువులకు వ్యాక్సిన్ అందించాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి



జమ్ములపాలెంలో పాడి రైతులతో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి

టంగుటూరు: వర్షాకాలంలో పశువులకు వ్యాప్తి చెందే దొమ్మరోగం నివారణకు టీకాలు శరవేగంగా అందించాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో దొమ్మరోగం నివారణకు వ్యాక్సిన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ గ్రామంలోని పశువులకు వ్యాక్సిన్ అందించి, మాట్లాడుతూ పశువులను వర్షానికి తడవకుండా షెడ్లు నిర్మించుకోవాలని, సకాలంలో దూడలు, పశువులకు వ్యాక్సిన్ చేయించాలన్నారు. పశువులకు పాకలు లేని రైతులు గోకులం పథకం ద్వారా పొందాలని తెలిపారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే రోగాలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కసుకుర్తి సుధీర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు

ఒంగోలు టౌన్: వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు సూచించారు. తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా మెడికల్ కళాశాలలో సీటు సాధించిన విద్యార్థులు అంతే పట్టుదలతో చదువులపై దృష్టి సారించాలని చెప్పారు. మంగళవారం 2024 బ్యాచ్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రోగ్రాంలో మెడిసిన్‌కు సంబంధించిన అన్నీ వైద్య విభాగాలను పరిచయం చేశారు. కళాశాల టూర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పరిశోధన, అధ్యయనం, ప్రతి రోజూ కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఉత్సుకతతో కెరీర్‌ను నిర్మించుకోవాలని చెప్పారు. సామాజిక బాధ్యతగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. కళాశాల జీవితంలో అనేక రకాల ప్రలోభాలు ఎదురవుతాయని, వాటి ప్రభావానికి గురైతే చదువుతో పాటుగా జీవితం దెబ్బతింటుందన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక వికాసం కోసం కళాశాలలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారని, చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడానికి విద్యార్థులు ప్రయత్నించాలని కోరారు. సీనియర్లు, జూనియర్ల మధ్య సఖ్యత ఉంటే కాలేజీ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని చెప్పారు. తమ ప్రతిభా పాటవాలతో ఒంగోలు వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఏదైనా మానసిక, శారీరక సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సుధాకర్ బాబు, కో ఆర్డినేటర్ డా.వసంత పాల్గొన్నారు.



నాణ్యమైన మద్యం ఇస్తున్నాం.. ఫుల్‌గా తాగండి అంటూ ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టింది రాష్ట్ర ప్రభుత్వం. ఉన్నట్టుండి మందుబాబుల ఆరోగ్యంపై ప్రేమ పుట్టికొచ్చినట్టు సరికొత్త నాటకానికి తెరతీసింది. ఆరోగ్య రక్షణ పేరుతో మరో రెండు శాతం సెస్ విధించి వారి జేబులు ఖాళీ చేసేందుకు పూనుకుంది. దీనిపై ఇటు వ్యాపారులు.. అటు ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని మానుకోవడమే పెద్ద రీహాబిలిటేషన్ అవుతుందని మహిళా సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

- మద్యంపై 2 శాతం సెస్ విధిస్తూ సర్కారు ఉత్తర్వులు
- రీహాబిలిటేషన్ పేరుతో సరికొత్త నాటకం
- మందుబాబులపై రూ.35 లక్షల అదనపు భారం
- ఇప్పటికే లైసెన్స్ రుసుం రూ.90 కోట్లు పిండుకున్న ప్రభుత్వం

ఛస్.. ఇదేంది?

ఒంగోలు టౌన్: సంపద సృష్టిపేరుతో ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోంది. నూతన మద్యం పాలసీ ముసుగులో ప్రైవేటు మద్యం దుకాణాలతో దోపిడీకి తెరతీసింది. ఒక్క దరఖాస్తుల పేరుతో కోట్లు దండుకున్న ప్రభుత్వం మందుబాబుల రీహాబిలిటేషన్ పేరుతో అదనంగా 2 శాతం సెస్ విధిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసి చీకటి దెబ్బకొట్టింది. వాస్తవానికి ఈ నెల అక్టోబర్ 1న విడుదల నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు సెస్ గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. నాన్ రిఫండబుల్ పేమెంట్ పేరుతో ఒక్కో దరఖాస్తుకు 2 లక్షల రూపాయలు వసూలు చేసింది. జిల్లాలోని 171 మద్యం దుకాణాలకు దరఖాస్తుల రూపంలో ప్రభుత్వం రూ.100 కోట్లకు పైగా దండుకునేందుకు స్కెచ్ వేసింది. అయితే అధికార టీడీపీ నేతల బెదిరింపులు, సిండికేట్ మాయాజాలంతో మద్యం వ్యాపారులు చాలా మంది ముందుకు రాలేదు. దీంతో 5 వేల దరఖాస్తులకు గాను 3466 వచ్చాయి. వీటి ద్వారా 69.32 కోట్ల రుపాయల ఆదాయం వచ్చింది. సోమవారం అంబేడ్కర్ భవనంలో కలెక్టర్ చేతుల మీదుగా లాటరీలు వేసి దుకాణాలను కేటాయించారు. అదే రోజు లైసెన్సులు మంజూరు చేసిన ప్రభుత్వం నిర్ణీత ఫీజు తక్షణమే చెల్లించకపోతే లాటరీలో తదుపరి స్థానంలో వచ్చిన రిజర్వ్ అభ్యర్థికి దుకాణం కేటాయిస్తామంటూ పరోక్షంగా ఒత్తిడికి గురిచేసింది. దాంతో లైసెన్సు పొందిన వ్యాపారులు ఫీజులు చెల్లించేందుకు క్యూ కట్టారు. తొలి విడతగా ఆరొంతుల లైసెన్సు ఫీజును సర్కారు వసూలు చేసింది. లైసెన్సుల రూపంలో మరో 17.50 కోట్ల రూపాయల వరకు ఫీజును ముక్కుపిండి వసూలు చేసింది. ఇందు కోసం స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచిలో నాలుగు కౌంటర్లను సైతం ఏర్పాటు చేసింది. లైసెన్సు దక్కించుకున్న వారు రేపటి నుంచి దుకాణాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో చావు కబురు చల్లగా చెప్పింది. డ్రగ్ రీహాబిలిటేషన్ పేరుతో మద్యంపై 2 శాతం సెస్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే దరఖాస్తులు, తొలి విడత లైసెన్సు ఫీజు పేరుతో రూ. 90 కోట్ల వరకు వసూలు చేసిన ప్రభుత్వానికి ఇంకా కడుపునిండినట్లు లేదు. సెస్ రూపంలో జిల్లాలో తొలి విడత ఫీజు నుంచి రూ.35 లక్షలు వసూలు చేసేందుకు సిద్ధమైంది. నాణ్యమైన మందు పేరుతో మద్యం తాగిస్తున్న ప్రభుత్వమే రీహాబిలిటేషన్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు మద్యం అమ్మకాలనే బ్యాన్ చేయొచ్చుకదా అంటూ మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నట్లుండి మద్యం బాబుల ఆరోగ్యంపై ప్రేమ పుట్టుకొచ్చినట్లుంది అంటూ విమర్శలు చేస్తున్నాయి.

కమీషన్ ఇవ్వాల్సిందే..

రిటైల్ మద్యం వ్యాపారులకు 20 శాతం మార్జిన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలు 20 నుంచి 30 శాతం కమీషన్ ఇస్తేనే వ్యాపారం చేయనిస్తాం లేకుంటే లేదని చెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దర్శిలో ఏకంగా 50 శాతం డిమాండ్ చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. కొండపిలో మనోళ్లకైతే 20 శాతం, ఇతరులైతే 30 శాతం కప్పం చెల్లించాలని చెబుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇక ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది నెలవారీ మాముళ్లు ఉండనే ఉంటాయి. ఇవన్నీ తలచుకొని కొందరు వ్యాపారులు బెదిరిపోతున్నారు. ఈ గుంజుడేందిరా బాబు అంటూ తలలు పట్టుకుంటున్నారు.

జిల్లాలో బుధవారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా తీరప్రాంత మండలాల్లో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమాన ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందుజాగ్రత్త చర్యగా బుధవారం స్కూళ్లకు సెలవు ప్రకటించింది. మంగళవారం కలెక్టర్ అన్సారియా తీరప్రాంత మండలాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.



కొండపి మండలంలో పొంగి పొర్లుతున్న ముసి వాగు

- నేడు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు
- వాతావరణ శాఖ హెచ్చరికలు
- జిల్లాకు 30 మందితో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం
- 18 గ్రామాలపై భారీవర్షాల ప్రభావం
- పశ్చిమ ప్రాంతంలోని పలు మండలాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం
- ఇప్పటికే కంట్రోలు రూములు, పునరావాస కేంద్రాల ఏర్పాటు
- నేడు విద్యాసంస్థలకు సెలవు

రెడ్ అలర్ట్

ఒంగోలు అర్బన్: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురవనున్నాయి. రెండు రోజులుగా వర్షం కురుస్తుండగా బుధవారం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు చేసింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే 30 మందితో కూడిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు జిల్లాకు చేరుకున్నాయి. వర్షాలకు ఏ ఇబ్బందులు ఎదురైనా యంత్రాంగం తక్షణమే స్పందించేలా కలెక్టరేట్‌లో 1077 టోల్‌ఫ్రీ నంబర్‌తో కంట్రోలు రూము ఏర్పాటు చేశారు. ఇప్పటికే మండల స్థాయిల్లో సైతం కంట్రోలు రూములు ఏర్పాటు చేసి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. పలు చోట్ల తుఫాన్ షెల్టర్లను సిద్ధం చేయడంతో పాటు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ముంపు ప్రాంతాల ప్రజలను ముందస్తుగానే తరలించి ఆహారం, ఔషధాలను అందజేస్తున్నారు. కాలువలు, చెరువులు, వాగులు వంటి ప్రదేశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. తీర ప్రాంత మండలాల్లో మరింత అప్రమత్తమై లోతట్టు ప్రాంతాలపై నిరంతరం పహారా ఏర్పాటు చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. తీర ప్రాంతాలైన నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లోని 18 గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అధికార యంత్రాంగం గుర్తించింది. ఆయా గ్రామాల పరిధిలో 54 హాబిటేషన్లలో ఉంటున్న 56,584 మంది ప్రభావితం అయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించింది. ఆయా హాబిటేషన్ల పరిధిలో పక్కా గృహాలు 9860 ఉండగా సెమీ పక్కాగృహాలు 3,677, కచ్చా ఇళ్లు 1,058 ఉన్నాయి. ఆయా మండలాల్లో 33 పునరావాస కేంద్రాలను ముందస్తుగా గుర్తించి ప్రస్తుతం 5 కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కొత్తపట్నంలో 2, టంగుటూరులో 1, సింగరాయకొండ పాకలలో 1, ఎన్‌జీపాడులో 1 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిలో 214 మంది ఆశ్రయం పొందుతున్నారని, వారికి అవసరమైన భోజనం, తాగునీరు, ఔషధాలు అందుబాటులో ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఆమె సూచించారు. వర్షాల కారణంగా ఎటువంటి పరిస్థితులు తలెత్తినా సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉందన్నారు. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలో సగటున 51 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని తెలిపారు. సింగరాయకొండ, నాగులుప్పలపాడు, ఒంగోలు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, కొత్తపట్నం, సీఎస్ పురం, మద్దిపాడు, పొదిలి, తాళ్లూరు, పామూరు, సంతనూతలపాడు, పీసీపల్లి, ముండ్లమూరు మండలాల్లో 80 మి.మీటర్ల కంటే అధికంగా వర్షపాతం నమోదైందని తెలిపారు.

మంగళవారం వర్షపాతం ఇలా..

జిల్లా మొత్తం మీద మంగళవారం 6.1 మిల్లీ మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. జిల్లా కేంద్రం ఒంగోలులో 3 మి.మీటర్లు నమోదు కాగా టంగుటూరు 6.2, కొత్తపట్నం 1.4, నాగులుప్పలపాడు 6, చీమకుర్తి 11.4, సంతనూతలపాడు 6, కొండపి 6.8, జరుగుమల్లి 16.2, సింగరాయకొండ 7, ముండ్లమూరు 7.4, కనిగిరి 4.2, వెలిగండ్ల 8, పామూరు 2, సీఎస్ పురం 3.4, పీసీపల్లి 7.6, పొన్నలూరు 6.2, మర్రిపూడి, పొదిలి 8.2, కొనకనమిట్ల 7.6, దర్శి 19.6, దొనకొండ 15.6, కురిచేడు 8, మార్కాపురం 5.2, తర్లుపాడు 2.2, దోర్నాల 8.8, యర్రగొండపాలెం 3, త్రిపురాంతకం 3.8, పుల్లలచెరువు 16, గిద్దలూరు 5.6, రాచర్ల 4, కొమరోలు 2.2, బేస్తవారిపేట 2, కంభం 1.2, అర్ధవీడులో 2.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

అన్నీ విధాలుగా సిద్ధంగా ఉండాలి:

భారీ వర్షాలకు జిల్లాలో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్నీ విధాలుగా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం గ్రీవెన్స్ హాలులో వర్షాలపై కలెక్టర్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో భారీ వర్షాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తీసుకుంటున్న చర్యలపై జిల్లా యంత్రాంగం మంత్రికి వివరించారు. అన్నీ శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రి ఆదేశించారు. సురక్షిత తాగునీటిని అందించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ శ్రీలత, సీపీవో వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మా నాయక్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ అధికారి శ్రీనివాసప్రసాద్, డీపీవో వెంకటనాయుడు, డీటీసీ సుశీల, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఒంగోలు ఇందిరమ్మ కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొండపి...

వర్షాల కారణంగా ముసివాగు పొంగే అవకాశం ఉండడంతో అధికారులు కొండపి, ఒంగోలు వయా సంతనూతలపాడు మీదుగా రాకపోకలను నిలిపివేశారు. ముసి వాగు దగ్గరికి ఎవరినీ ప్రవేశించకుండా కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ప్రభావిత కుటుంబాలుగా అంచనా

భారీ వర్షాలకు ప్రజలకు ఇబ్బంది లేకుండా పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. జిల్లాలోని 38 మండలాలకు సంబంధించి 10 మండల స్థాయి స్టాక్ పాయింట్లు ఉండగా వాటిలో ఒంగోలు, సింగరాయకొండ స్టాక్ పాయింట్లకు సంబంధించిన 5 మండలాలను ప్రభావిత మండలాలుగా గుర్తించి ఆయా మండలాల్లో 15 వేల కుటుంబాలు ప్రభావితం అవుతాయని అంచనా వేశారు. దీంతో ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, 1 కేజీ కందిపప్పు, 1 కేజీ పంచదార, 1 లీటరు పామాయిల్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆమేరకు రెండు స్టాక్ పాయింట్లలో 375 టన్నుల బియ్యం, 15 టన్నుల పంచదార, 15 టన్నుల కందిపప్పు సిద్ధంగా ఉంచారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఒంగోలు సిటీ: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, అన్నీ పాఠశాలలు, కాలేజీలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయలకు రావద్దని కోరారు.

పశ్చిమాన ఆకస్మిక వరదలు..

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి వచ్చిన సమాచారం మేరకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని అర్ధవీడు, దోర్నాల, కంభం, పెద్దారవీడు, మార్కాపురం, రాచర్ల, ముండ్లమూరు మండలాల్లో 15వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నట్లు విపత్తు నిర్వహణ శాఖ వెల్లడించింది. దీంతో ఆయా మండలాల్లోని ప్రజలను అప్రమత్తం చేసేందుకు యంత్రాంగం చర్యలు ప్రారంభించింది.

తమ్ముళ్ల తకరారు

- మద్యం షాపుల ఏర్పాటుపై తెలుగు తమ్ముల మధ్య రగడ
- ఒకే ప్రాంతంలో 4 షాపుల ఏర్పాటుకు సిద్ధం
- త్రిపురాంతకం మండలంలోని మేడపిలో లిక్కర్ హబ్

యర్రగొండపాలెం: త్రిపురాంతకం మండలంలోని మేడపి గ్రామాన్ని లిక్కర్ హబ్‌గా మార్చటానికి తెలుగు తమ్ముళ్లు ఒక్కటయ్యారు. లాటరీ పద్ధతిలో మేడపి పాయింట్‌గా షాప్ దక్కించుకున్న మరో తమ్ముడికి ఇబ్బంది పెట్టేందుకు ఆ మండలంలో లిక్కర్ షాపుల లైసెన్స్‌లు పొందిన వారంతా సిండికేట్‌గా మారారు. త్రిపురాంతకం మండలంలో మొత్తం 5 షాపులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ షాపులకు గాను 94 మంది సిండికేట్‌గా మారి అర్జీలు దాఖలు చేశారు. వారిలో పల్నాడు జిల్లా వినుకొండ మండలం, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం, దోర్నాల మండలాలకు చెందిన వారికి ఒక్కొక్క షాపు, త్రిపురాంతకం మండలానికి చెందిన వారికి రెండు షాపుల ప్రకారం దక్కాయి. ఈ ఐదు షాపులు దక్కించుకున్న వారిలో నలుగురు సిండికేట్‌గా మారేందుకు సిద్ధమయ్యారు. మేడపి పాయింట్‌గా షాపు లైసెన్స్ పొందిన వ్యక్తి మాత్రం ఆ సిండికేట్‌లో చేరేందుకు సుముఖంగా లేకపోవడంతో ఆ ప్రాంతంలోనే తమ షాపులు నిర్వహించుకోవటానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు మేడపిలో షాపులను అద్దెలకు తీసుకున్నట్లు తెలిసింది. కూటమిగా మారిన 4 షాపుల్లో ఒకటో, రెండో మేడపిలో, మిగిలిన షాపులు త్రిపురాంతకం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవటానికి సన్నాహాలు కూడా చేసుకుంటున్నారు. మేడపి గ్రామం జాతీయ రహదారిపై ఉండటంతోపాటు త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లోని ఎక్కువ గ్రామాలు ఆ ప్రాంతానికి దగ్గరలో ఉంటాయి. దీనివలన అక్కడ మద్యం అమ్మకాలు బాగా ఉంటాయని, మేడపి షాపు రోజుకు రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు వ్యాపారం జరుగుతుందని ఒకరు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో వ్యాపారం జరిగే పాయింట్ త్రిపురాంతకం మండలంలో లేకపోవడంతో షాపులు దక్కించుకున్న వారంతా మేడపిపై కన్నేశారన్నారు.

షాపులు దక్కించుకున్న వారంతా టీడీపీకి చెందినవారైనా తమ లాభాపేక్ష కోసం వారిమధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. ఏదో ఒక విధంగా మేడపి పాయింట్ దక్కించుకున్న తెలుగు తమ్ముడిని బెదిరించి తమ సిండికేట్‌లో చేర్పించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. తాను కూడా అధికార పార్టీకి చెందిన వాడినేనని, తనతోపాటు వ్యాపారానికి పెట్టుబడి పెట్టిన మరి కొంతమంది తమ పార్టీకి చెందిన వారేనని కేవలం తాను బలహీనుడనని తనపై కక్షకట్టి ఇబ్బందులు పెడుతున్నారని, ఈ విషయంపై పార్టీ పెద్దల వద్ద పంచాయతీ పెట్టేందుకు వెనకాడనని షాపు లైసెన్స్ పొందిన వ్యక్తి అంటున్నట్లు తెలిసింది. ఈ రగడను ఎక్సైజ్ శాఖ అధికారులు, టీడీపీ పెద్దలు ఏ విధంగా పరిష్కరిస్తారో వేచిచూడాల్సిందే. పుల్లలచెరువు మండలంలో ఉన్న మూడు షాపులు ఒకే సామాజిక వర్గానికి చెందిన తెలుగు తమ్ముళ్లు కావడంతో ఆ మండలంలోని చాపలమడుగు, ముటుకుల, పుల్లలచెరువు ప్రాంతాల్లో షాపులు నిర్వహించటానికి సిద్ధమయ్యారు.

మద్యం షాపు మాకొద్దు



కంభంలో సీఐతో మాట్లాడుతున్న స్థానికులు

- మద్యం షాపులు మరోచోటికి మార్చాలంటూ మహిళల ఆందోళన

కంభం: పాఠశాలకు వెళ్లే మార్గంలో, జనావాసాలకు మధ్యలో మద్యం దుకాణాలు పెట్టొదంటూ స్థానిక షిరిడీ సాయినగర్ కు చెందిన మహిళలు స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐ కొండారెడ్డి తో మాట్లాడుతూ బస్టాండ్ సమీపంలో మద్యం దుకాణాలు పెడితే విద్యార్థులు, మహిళలకు ఇబ్బంది కరంగా ఉంటుందని వారు తెలిపారు. షాపులు అక్కడే పెడితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అక్కడ ఏర్పాటు చేసే షాపులు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండే మరోచోటికి మార్చాలని కోరుతూ ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేశారు.



కొండపిలో అర్జీ ఇచ్చేందుకు స్టేషన్‌కు వచ్చిన మహిళలు

కొండపిలో..

కొండపి: కొండపిలో మద్యం షాపు దక్కించుకున్న వ్యక్తి స్థానిక గొడుగులపాలెంలో ప్రజలు నిత్యం సంచరించే ప్రదేశంలో మద్యం షాపు పెడుతున్నారని అక్కడ మద్యం షాపు పెట్టవద్దని మంగళవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో కొండపి పోలీస్ స్టేషన్ కు స్థానికులు వచ్చి అర్జీ సమర్పించారు. మద్యం షాపు పెడుతున్న దాని సమీపంలో చర్చి, అంగనవాడీ స్కూల్ భవనాలు ఉన్నాయన్నారు. అటువంటి ప్రదేశంలో ఎలా అనుమతి ఇస్తారని, వెంటనే ఆ ప్రదేశంలో నుంచి మద్యం షాపును తొలగించాలని కోరారు.

క్లుప్తంగా

టీచర్ మౌలాలికి కలాం నేషనల్ ఫెలోషిప్ అవార్డు



మౌలాలి

మార్కాపురం: మార్కాపురం పట్టణ వాసి, తర్లుపాడు మండలం లింగారెడ్డి కాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం షేక్ మౌలాలి కలాం నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపిక య్యారు. తిరుపతికి చెందిన కలాం ట్రస్టు ఏటా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు అవార్డులు అందిస్తోంది. మౌలాలి గత ఏడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడంతోపాటు నాణ్యమైన విద్య అందించేందుకు వివిధ రకాల బోధనా పద్ధతులను అనుసరిస్తున్నారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచే విధంగా పాఠాలు బోధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నెల 19న తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఇస్రో ఓఎస్డీ కేవీ లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు మౌలాలి తెలిపారు. ఈ సందర్భంగా మౌలాలిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

డాక్టర్ గృహంలో నగలు చోరీ

● రూ. 15 లక్షల విలువైన సొత్తు మాయం

ఒంగోలు టౌన్: నగరంలోని ఒక డాక్టర్ ఇంటిలో బంగారు నగల బ్యాగు చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. సాయి నగర్‌లో నివశించే డాక్టర్ సుబ్బారావు, భార్యతో కలిసి ఆదివారం ఉదయం ఓ శుభకార్యానికి బాపట్ల వెళ్లి రాత్రి తిరిగి వచ్చేశారు. ఓ బ్యాగులో 15 లక్షల రూపాయలు విలువ చేసే 22 సవర్ల బంగారు నగలను కూడా తీసుకెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత అలసి పోయి లగేజీతో పాటు బంగారు నగలు ఉన్న బ్యాగును కూడా వరండాలో పెట్టి ఇంట్లో పడుకున్నారు. తెల్లవారుజామున నిద్రలేచిన తరువాత చూస్తే బ్యాగు కనిపించలేదు. వెంటనే తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారం ఇంటి ముందు మురుగు కాలువలో అదే బ్యాగు కనిపించింది. తెరచి చూస్తే నగలు లేవు. క్లూస్ టీం సభ్యులు ఫింగర్ ప్రింట్ సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గ్రానైట్ శ్లాబ్ కంటైనర్లు సీజ్



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన కంటైనర్లు

ఒంగోలు సిటీ: గ్రానైట్ శ్లాబ్‌లను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్ మంగళవారం హెచ్చరించారు. సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో అక్రమంగా గెలాక్సీ గ్రానైట్ శ్లాబ్‌లను చెన్నై పోర్టుకు తరలిస్తున్న రెండు కంటైనర్ లారీలను సీజ్ చేసినట్లు తెలిపారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా రవాణా చేస్తున్నట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. తనిఖీల్లో గనుల శాఖ అధికారులు అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్‌కుమార్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు కృష్ణారెడ్డి, రాజు నాయుడు పాల్గొన్నారు.

ఉద్యమాలను కేసులతో ఆపలేరు



కేసు కొట్టివేత అనంతరం కోర్టు బయట తీర్పును స్వాగతిస్తున్న వామపక్షాల నాయకులు

మార్కాపురం టౌన్: పోలీసు కేసులతో ఉద్యమాలను, ప్రజా పోరాటాలను ఆపలేరని వామపక్ష నాయకులు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, అందె నాసరయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోరుతూ 2016లో చేపట్టిన నిరసన ప్రదర్శనలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం కేసును కొట్టివేస్తూ మార్కాపురం కోర్టు అదనపు న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రయోజనాలను కాంక్షిస్తూ నిరసన తెలిపితే పోలీసులు అక్రమంగా తమతోపాటు తమ నాయకులపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. నాటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 15వ తేదీ వరకు కేసులోని సాక్షులను, పోలీసులను విచారించిన న్యాయస్థానం.. ఆరోపణలు రుజువు కానందున కేసును కొట్టివేసిందని వివరించారు. కేసు ఎదుర్కొన్న వారిలో సీపీఎం నాయకులు డి.సోమయ్య, డీకేఎం రఫీ, రాజు, బాలనాగయ్య, నగేష్, సీపీఐ నాయకులు ఖాశీం, చిత్తారి పెద్దన్న, అల్లూరయ్య తదితరులు ఉండగా.. వామపక్ష నాయకుల తరపున న్యాయవాది జేఎస్ఆర్ కృష్ణాశాస్త్రి వాదించినట్లు తెలిపారు.

ఇసుక.. సుమంతైనా లేక!

- ఇసుక కోసం పేద, మధ్య తరగతి ప్రజల అవస్థలు
- ఉచిత ఇసుక హామీని అటకెక్కించిన కూటమి ప్రభుత్వం
- ఉపాధి కోల్పోతున్న భవన నిర్మాణ కార్మికులు
- మరోవైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేతలు



ఒంగోలులో ఖాళీగా ఉన్న ఇసుక స్టాక్ పాయింట్

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాన్యులకు ఉచిత ఇసుక అందజేస్తామని సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ–జనసేన నేతలు ఇచ్చిన హామీ అటకెక్కింది. దీంతో సామాన్యులు, మధ్య తరగతి ప్రజలకు ఇసుక లభించక ఇళ్లు కట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికులు సైతం పనులు లేక పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. వేల రూపాయలు వెచ్చించినా ఇసుక చిక్కకపోవడంతో భవన నిర్మాణదారులు బేల చూపులు చూస్తున్నారు. అదే సమయంలో అధికార పార్టీ నాయకులు మాత్రం ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న ప్రజలు మాత్రం కూటమి నాయకుల తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎక్కడికక్కడ స్టాకు పాయింట్లు ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేకపోవడంతో నోటికి పని చెబుతున్నారు.

సామాన్యుల అవస్థలు వర్ణణాతీతం

ఇసుక లభించకపోవడంతో జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, పొదిలి తదితర పట్టణాల్లో సుమారు 15 వేలకు పైగా భవన నిర్మాణాలు నిలిచిపోయాయని అంచనా. ప్రైవేటు భవనాలతోపాటు ప్రభుత్వ భవనాల నిర్మాణంపైనా ఇసుక కొరత ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఇళ్ల నిర్మించుకుందామనుకున్న వారు కూడా తమ ప్రయత్నాలను విరమించుకుంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇప్పటి వరకు ఇసుక విక్రయానికి సంబంధించి శాశ్వత విధానాన్ని అమలు చేయలేదు. నూతన మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్‌లో ఇసుక చేసుకోవాలంటే అవస్థలు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక నిల్వలు లేవని చూపుతుండటంతో ఇసుక బుకింగ్‌కు సమస్యలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో ఇసుకకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేకుండా స్టాకు పాయింట్లలో ఇసుకను నిల్వ ఉంచగా.. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి నాయకులు మూడొంతుల ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. పైగా నూతనంగా స్టాకు పాయింట్లను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో సామాన్యులు నెల్లూరు, కడప, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి ఇసుకను తెప్పించుకునేందుకు నానా అవస్థలు పడటమే కాకుండా వేలకు వేలు ఖర్చు చేయాల్సిన దుస్థితి.

కార్మికుల ఉపాధిపై దెబ్బ

ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ పనులు నిలిచి కూలీలు అవస్థలు పడుతున్నారు. పూట గడవక కుటుంబ పోషణ భారమై పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకటీ రెండు రోజులైతే కార్మికులు ఓపిక పట్టగలరు. కానీ మూడు నెలల నుంచి ఇసుక అందుబాటు లేకపోవడంతో వేలాది మందికి పని దొరకడం లేదు. అందినకాడల్లా అప్పు చేసి కాపురాలను నెట్టుకొస్తున్నామని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక కొరతతో ఉపాధి కోల్పోతున్నాం



నా దగ్గర 30 మంది బేల్దారి కూలీలు పని చేస్తున్నారు. కొత్తపట్నం మండలంలో ఇసుక కొరతతో పనులన్నీ ఆగిపోయాయి. శ్లాబులు, కట్టుబడులు ఏమీ ముందుకు సాగడం లేదు. లోకల్‌గా దొరికే ఇసుక కొన్ని పనులకే మాత్రమే పనికొస్తోంది. నాణ్యమైన ఇసుక వాడాల్సి ఉంది కానీ ఎక్కడా దొరకడం లేదు. కూలీలందరూ ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నారు. ఇసుక కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం.
– ద్వారం నాగరాజు, బేల్దారి మేస్త్రీ, కొత్తపట్నం

స్టాక్ పాయింట్లు ఖాళీ

సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒంగోలు ఏఎంసీ యార్డులోని స్టాక్ పాయింట్‌లో 1818 టన్నులు, జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు–1 స్టాక్ పాయింట్‌లో 16,044 టన్నులు, చతుకుపాడు–2 స్టాక్ పాయింట్‌లో 24,972 టన్నుల ఇసుకను నిల్వ ఉంచింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయా పార్టీల శ్రేణులు ఇసుక నిల్వలను గద్దల్లా తన్నుకుపోయారు. సామాన్యులకు సంబంధించిన ట్రాక్టర్లు, టిప్పర్లకు ఇసుకను నింపాలంటే కనీసం మూడు రోజులు వేచి ఉండేలా చేసిన పాలకులు.. టీడీపీ, జనసేన నేతల వాహనాలకు మాత్రం ఆగమేఘాల మీద ఇసుకను లోడ్ చేసి పంపారు. ఈ క్రమంలోనే వేల టన్నుల ఇసుకను కూటమి నాయకులు అప్పనంగా అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. వర్షా కాలంలో ఇసుకకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన కూటమి ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం.. స్టాక్ పాయింట్లు ఒక్కసారిగా ఖాళీ కావడంతో భవన నిర్మాణాలపై పెను ప్రభావం పడింది. వర్షాలు తగ్గగానే స్టాక్ పాయింట్లకు ఇసుక చేరుస్తామని నెల రోజుల క్రితం గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా చేసిన ప్రకటన కూడా కార్యరూపం దాల్చలేదు. తాజా మార్గదర్శకాలు విడుదల చేశామని, నూతన విధానం ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చిందని ప్రభుత్వం పేర్కొన్నా.. ఇసుక ఎక్కడ ఉందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది.

సర్వసన్నద్ధంగా పోలీసు యంత్రాంగం

● ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సర్వసన్నద్ధం చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక బలగాలను సైతం సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బందితో 18 టీములను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి టీములో 20 మంది సిబ్బంది, ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు బలగాలు సహాయక చర్యల నిమిత్తం సిద్ధం చేసినట్లు తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన లైటింగ్ సామగ్రి, లైఫ్ జాకెట్లు, తాళ్లు, బ్యాటన్లు, జేసీబీలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రత్యేక బలగాల బందోబస్తుతో పాటుగా జిల్లా పోలీసు కార్యాలయంలో కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. నదులు, వాగులు, వంకలు, చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్లవద్దని, పిల్లలను కూడా ఈతకు వెళ్లకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. నీటి ప్రవాహక ప్రాంతాలకు వెళ్లి చేజేతులా ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. సముద్ర తీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు రెవెన్యూ, పోలీసు సిబ్బంది సూచించిన విధంగా ఆయా ప్రాంతాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు, తుఫాన్ షెల్టర్‌కు వెళ్లాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం పొందాలనుకుంటే వెంటనే పోలీసు కంట్రోలు రూంలోని 112కి కానీ, పోలీసు వాట్సప్ నంబర్ 9121102266, స్థానిక పోలీసు అధికారులకు ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు.

ముమ్మరంగా గస్తీ నిర్వహించాలి..

రోడ్లపై విరిగిపడిన చెట్లను వెంటనే తొలగించాలని, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఉధృతంగా ప్రవహించే నదీ పరివాహక ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని, నీట మునిగిన రహదారుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి రహదారులను మూసివేయాలని సూచించారు. చెరువులు, కుంటలు నిండి లోతట్టు ప్రాంతాలు గండి పడే అవకాశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి ఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

ఆలయంలో హుండీ చోరీ



బీడుభూముల్లో పడేసిన హుండీ

కురిచేడు: మండలంలోని ఎస్ఎస్పీ అగ్రహారంలో వేంచేసి ఉన్న శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి హుండీ చోరీ జరిగింది. గత మేనెలలో అమ్మవారి జాతర జరగాల్సి ఉండగా.. ఎన్నికల నియమావళి ఉన్నందున జాతర మొక్కుబడిగా నిర్వహించి హుండీలోని కానుకలు బయటకు తీయలేదు. ఈ క్రమంలో నిత్యం ఆలయ గోడలపై మందుబాబులు మద్యం సేవిస్తుంటారు. హుండీలో భక్తులు ఏడాదిన్నర కాలంగా వేస్తున్న నగదు, బంగారు ఆభరణాలు, ముడుపులు పెద్ద మొత్తంలో ఉన్నట్లు తెలిసిన వారే ఈ దురాగతానికి పాల్పడి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హుండీని చోరీ చేసిన వారు పడమరవీరాయపాలెం వెళ్లే దారిలోని బీడుభూముల్లో హుండీ పగులగొట్టి అందులోని నగదు, బంగారు ఆభరణాలు తీసుకుని ఖాళీ హుండీ అక్కడే పడేసి వెళ్లారు. మంగళవారం ఉదయం ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని గ్రామస్తులు గమనించారు. ఆలయానికి సమీపంలోని చికెన్‌షాపు వద్ద ఉన్న సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించిన తరువాత దొంగలను గుర్తించాల్సి ఉంది. క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించింది.

రెండు చెక్ బౌన్స్ కేసుల్లో జైలు శిక్ష

● రూ. 13 లక్షల పరిహారం

కనిగిరి రూరల్: ఒకే మహిళ రెండు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో రూ. 13 లక్షల పరిహారం, జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జడ్జి కె. భరత్ చంద్ర తీర్పునిచ్చారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి మండలం గురువాజీపేటకు చెందిన కె. ప్రమీల, తమ్మినేని పల్లికి చెందిన తమ్మినేని ఫణీంద్ర దగ్గర రూ. 3 లక్షల ఇరవై ఐదు వేలు అప్పు తీసుకుని దాని తాలూకు ఐదు లక్షల చెక్కును ఇచ్చింది. ఫణీంద్ర చెక్కును బ్యాంక్‌లో వేయగా అది బౌన్స్ అయ్యింది. ఈ కేసు మూడు సంవత్సరాలు విచారణ జరిగింది. మంగళవారం కనిగిరి జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కె. భరత్ చంద్ర నిందితురాలు కుమ్మరి కుంట ప్రమీలకు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 5 లక్షల పరిహారం విధిస్తూ తీర్పునిచ్చారు.

మరో కేసులో..

గురువాజీపేటకు చెందిన కె. ప్రమీల బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తూము ఆదిరెడ్డి దగ్గర రూ. 5,10,000 అప్పు తీసుకుని దాని తాలూకు రూ. 8 లక్షల చెక్కు ఇచ్చింది. సదరు ఆదిరెడ్డి చెక్కును బ్యాంక్‌లో వేయగా అదిబౌన్స్ అయ్యింది. ఈ కేసు నాలుగు సంవత్సరాలు విచారణ జరిగింది. న్యాయమూర్తి కె. భరత్ చంద్ర నిందితురాలు కుమ్మరికుంట ప్రమీలకు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 8 లక్షలు పరిహారం విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

కన్నీటి ఘోష

- గిద్దలూరు నగరంలోని చట్టిరెడ్డిపల్లెలో నీటి ఇక్కట్లు
- బిందె నీటి కోసం వర్షంలో తడుస్తూ పడిగాపులు
- అరకొర ట్యాంకర్లతో మనస్పర్థలు



వర్షంలో గొడుగులు పట్టుకుని క్యూలో ఉన్న మహిళలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని చట్టిరెడ్డిపల్లె గ్రామ ప్రజలు గత వారం రోజుల నుంచి నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న రెండు బోర్లలో నీరు అడుగంటడంతో సమస్య ఉత్పన్నమైంది. బోర్ల నుంచి వచ్చే అరకొర నీటిని పట్టుకునేందుకు జనం పడిగాపులు కాస్తున్నారు. బోర్లలో నీరు సక్రమంగా రావడం లేదన్న ఫిర్యాదుతో నెల రోజుల క్రితం నూతనంగా మరో డీప్ బోరు వేసిన నగర పంచాయతీ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇప్పించడంలో తాత్సారం చేశారు. వారం రోజులుగా బోర్ల నుంచి నీరు పూర్తిగా రాకపోవడంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. ట్యాంకర్లు ఏ సమయంలో వస్తాయో తెలియకపోవడంతో స్థానికులు నీరు పట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. అదే సమయంలో ట్యాంకర్ల వద్ద ఘర్షణలు తలెత్తుతున్నాయి. ట్యాంకర్ల నీరు సరిపోకపోవడంతో మసీదు పక్కనే ఉన్న బోరు వద్ద బిందె నీటి కోసం వర్షంలో తడుస్తూ ప్రజలు బారులుదీరారు. నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం వద్దకు మహిళలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో నూతనంగా వేసిన బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించారు. అయితే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చట్టిరెడ్డి పల్లెలో నీటి కోసం ఘర్షణ పడుతున్న స్థానికులు

నవరత్నాల శిలాఫలకం ధ్వంసం



బసవన్నపాలెం ఆర్‌బీకే భవనం పై ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పీకి వేసిన దృశ్యం



నవరత్నాల శిలాఫలకాన్ని చిల్లచెట్లలో పడవేసిన దృశ్యం

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేపై ఉన్న శిలాఫలకాన్ని కొందరు వ్యక్తులు తొలగించి చిల్లచెట్లలో పడేశారు. దీనిపై ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు మంగళవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐకి ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లగా ఆయన స్టేషన్‌లో లేకపోవడంతో రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు పంపనున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం వచ్చారని, ఆయన వచ్చే ముందే శిలాఫలకాన్ని కొందరు యువకులు తొలగించారన్నారు.

కుక్కల స్వైర విహారం



వీధులో గుంపులుగా ఉన్న కుక్కలు

● రెండు రోజుల్లో ఆరుగురిపై దాడి



పిచ్చి కుక్కకాటుకు గురైన చిన్నారి

కురిచేడు: స్థానికంగా కుక్కల బెడదపెరిగింది. ఏ వీధిలోచూసినా కుక్కలు గుంపులుగుంపులుగా చేరి వెంటాడి కరుస్తున్నాయి. ఇటీవల ఉద్యోగులు బదిలీలు జరగటంతో నూతనంగా వచ్చిన వారు సక్రమంగా విధులుకు హాజరు కావటంలేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. రెండు రోజుల్లో ఆరుగురుని గాయపరిచాయి.

పునరావాస కేంద్రాల పరిశీలన



కొత్తపట్నంలో పునరావస కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీం అన్సారియా

కొత్తపట్నం: అల్పపీడనం కారణంగా మూడు రోజుల నుంచి కురుస్తున్న అధిక వర్షాలకు ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాలను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం పరిశీలించారు. పునరావస కేంద్రంలో భోజనం పెడుతున్నారా, తాగు నీరు, వసతులు కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం కొత్తపట్నంలో జూనియర్ కళాశాలలో, బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. ముందుగా జూనియర్ కాలేజీ, హైస్కూల్ పునరావాస కేంద్రాల శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునారావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఎలాంటి లోటు రాకుండా అవసరమైన వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన భోజన సదుపాయాలను అందించాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తొలిగే వరకు పునరావాస సదుపాయాలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. జూనియర్ కళాశాలలో 40 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 35 మంది ఆశ్రయం పొందుతున్నారని వీరి కోసం 24 గంటలు వైద్య సేవలు అందించేలా మెడికల్ క్యాంపులను కూడా ఏర్పాటు చేశామన్నారు. గంగమ్మ కాలనీలోని ఇళ్లల్లో నీరు చేరితే పొక్లెయిన్ ద్వారా రెండు కిలో మీటర్లు దూరం కాలువ తీయించి నీరును బయటకు పంపించామని తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు కలెక్టర్‌కు వివరించారు. ఒంగోలు ఆర్డీఓ లక్ష్మిప్రసన్న, ఏవో మోహన్‌రెడ్డి, ఆర్ఐ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అల్లెయ్య, మెడికల్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

చీరాల టౌన్: అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త, బీసీ నాయకుడు పులి శ్రీనివాసరావు (45) మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని.. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కీర్తివారిపాలెం సిటీ ఫారెస్ట్ వద్ద నిర్మిస్తున్న 167 ఏ వాడరేవు–పిడుగురాళ్ల హైవే కల్వర్టు వద్ద శ్రీనివాసరావు మృతదేహం లభ్యమైన స్థలం వద్ద కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈనెల 13న అనుమానస్పదంగా మృతి చెంది కల్వర్టులో పడి ఉన్న పులి శ్రీనివాసరావు మృతికి గల కారణాలను త్వరగా వెలికి తీసి పోలీసులు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు. మృతుడు వివాదాలకు దూరంగా ఉండటమే కాకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరిస్తూ గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న తరుణంలో మృతిచెంది ఉండటం తమకు అనుమానాలను రేకెత్తిస్తుందన్నారు. పోలీసులు కేసును త్వరగా విచారించి నిజానిజాలు తెలపాలని డిమాండ్ చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేసి ఘటనలకు గల కారణాలను తెలపి తమకు, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పాపాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, కీర్తివారిపాలెం, వాకావారిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన వారు పాల్గొన్నారు.